గ్రీన్‌ఫీల్డ్ రోడ్డును రద్దు చేయండి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఆమనగల్లు, జనవరి 7: గ్రీన్‌ఫీల్డ్ రోడ్డును రద్దు చేయాలని మంగళవారం ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని సాకిబండతండాకు చెందిన రైతులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ వినతిపత్రంలో రైతులు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం వలన తమకున్న కొద్దిపాటి భూములను కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డు నిర్మాణం జరిగితే మాకు ఉన్న ఉపాధి కూడా కోల్పోవడం జరుగుందని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. వీరితో పాటు రైతులు పాండు, రాజా, రవిరాథోడ్, బాలు, గోపి, నార్యా, జైపాల్, దేవేందర్, మహేశ్, మణిపాల్ ఉన్నారు.

కమ్మదనం గురుకులాల్లో
పార్ట్‌టైం జూనియర్ లెక్చరర్ పోస్టులు

షాద్‌నగర్‌రూరల్, జనవరి 7: కమ్మదనం సాంఘిక సంక్షేమ కళాశాలలో పార్ట్ టైం జూనియర్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ విద్యుల్లత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, బయోసైన్స్‌ను బోధించేందుకు అర్హులైన వారు కళాశాలలో సంప్రదించాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థుల విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో బయోడేటాతో కమ్మదనం గురుకులాల్లో సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

యాచారం, జనవరి7: మండలంలోని మంఛన్‌గౌరెల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని నిమ్మకుంట 11కేవీ ఫీడర్‌లో చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మంఛన్‌గౌరెల్లి గ్రామ పరిధిలో ఉన్న వ్యవసాయ పొలాలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు విద్యుత్ సిబ్బందికి, ఇంజినీర్లకు అన్ని విధాలుగా సహకరించాలని వారు కోరారు.

కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వాలి

యాచారం, జనవరి7: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం కౌలు రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..మండలంలోని నందివనపర్తి, తాటిపర్తి, నజ్దిక్‌సింగారం, కుర్మిద్ద గ్రామాల్లో ఉన్న 1400 ఎకరాల భూములను రక్షిత కౌలు రౌతులు కౌలు చేసుకొని జీవనోపాధి పొందుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులకు రైతు భరోసాను అందించి ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు భరోసా రూ.15,000 ఇస్తానని ప్రగల్భాలు పలికిన రేవంత్‌రెడ్డి రూ.12000 ఇస్తానని మాట తప్పడం సిగ్గు చేటన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసా కింద రైతులకు రూ.15,000 ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. భూమిలేని పేదలకు సంవత్సరానికి రూ.12000 ఇస్తానని చెప్పిన రేవంత్ నేటికీ అమలు చేయకపోవడం, మహిళలకు నెలకు రూ2500 ఇస్తానని, ఆసరా పింఛన్లు పెంచకపోవడంతో సర్కారు పట్ల ప్రజలకు రోజురోజుకూ నమ్మకం పోతుందన్నారు. ఇల్లులేని ప్రతి పేద కుటుంబానికి ఇల్లు ఇవ్వాలన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

యాచారం, జనవరి 7 : మండల కేంద్రంలోని విద్యా వనరుల కార్యాలయం ఎదుట ఎస్టీయూటీఎస్ మండల నూతన క్యాలెండర్‌ను మండల విద్యాధికారి పాండురంగారెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. మండల ఉపాధ్యాయులకు క్యాలెండర్లను అందజేశారు. కార్యక్రమంలో యాచారం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహ, ఎస్టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాండురంగారెడ్డి, మండల బాధ్యులు బాలకృష్ణ, జగన్మోహన్‌రెడ్డి, రాందేవ్‌రాజు, సల్మాన్‌రాజ్ తదితరులున్నారు.

సావిత్రీబాయి పూలే ఆశయసాధనకు కృషి చేయాలి

ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 7 : సావిత్రీబాయిపూలే ఆశయసాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. సావిత్రీబాయిపూలే జయంతిని పురస్కరించుకుని మండల పరిధిలోని ఎలిమినేడు గ్రామంలో ఐద్వా ఆధ్వర్యంలో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడుతూ.. దేశంలో మహిళల చదువుకోసం ఎంతో కృషిచేసిన గొప్ప ఉపాధ్యాయురాలు సావిత్రీబాయిపూలే అన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్లు ఆశలత, అరుణ, విజయ, సుమలత, ఇందిరా, మున్నీ, భాగ్య తదితరులున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

మందులు అందజేస్తున్న
మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, వైద్యులు, నాయకులు

కడ్తాల్, జనవరి 7: మండల పరిధిలోని రావిచేడ్ గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్, రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్, గంప లక్ష్మయ్యగుప్తా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, కామినేని దవాఖాన సహకారంతో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ ప్రారంభించారు. ఈ శిబిరంలో 285 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు వైద్యులు అఖిల్, అనిల్ తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు రమేశ్‌యాదవ్, మాజీ ఎంపీటీసీలు గోపాల్, రంగయ్య, యాదయ్య, వసంత, సర్పంచ్ మాజీ ఉప సర్పంచ్ వెంకటేశ్, నాయకులు రవి, శ్రీనుగుప్తా, పాండునేత, బాలకృష్ణ, రామచంద్రయ్య, శేఖర్, సాయి, లింగం, సందీప్, తిరుపతి, పుల్లారెడ్డి, మహేశ్, మహేందర్, శ్రీశైలం, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలి

ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 7 : మండల పరిధిలోని ఎలిమినేడు గ్రామంలో భూసేకరణ కింద రావాల్సిన పరిహారంపై మంగళవారం సమావేశం నిర్వహించనుండగా, ఇబ్రహీంపట్నం ఆర్డీవో, తహసీల్దార్లు రాకపోవడం సరైన పద్ధతి కాదని భూ పోరాట కమిటీ వైస్ చైర్మన్ మంద కుమార్ అన్నారు. ఇందుకు నిరసనగా మంగళవారం ఎలిమినేడు గ్రామ పంచాయతీ ఎదుట బాధిత రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. రైతులకు రావాల్సిన భూ పరిహారం ఇవ్వకుండా తాత్సారం చేసినందుకు రైతులు భూపోరాట కమిటీ ఢిల్లీలోని ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను కలిసి తమ గోడును విన్నవించుకున్నారు. ఈ మేరకు రైతుల సమస్యలు తెలుసుకుని ప్రభుత్వానికి నివేదిక ఇచ్చేందుకు మంగళవారం గ్రామంలో సమావేశం నిర్వహించేందుకు రైతులందరూ రావాలని సోమవారం సాయంత్రం డప్పుచాటింపు వేయించి అకస్మాత్తుగా సమావేశం రద్దుచేయడంపై రైతులు ఆందోళనకు దిగారు. భూ పరిహారం విషయంపై రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదించాలని వారు డిమాండ్ చేశారు.

ఎలిమినేడు గ్రామపంచాయతీ ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

దాతను సన్మానిస్తున్న సీఐ విజయ్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్, జనవరి 7 : ఫరూఖ్‌నగర్ మండలంలోని హాజిపల్లి గ్రామ మాజీ ఉపసర్పంచ్ సుదర్శన్ పిలుపుమేరకు అతడి స్నేహితులు జర్నలిస్టులు గ్రామంలోని ఆలయాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక సీఐ విజయ్‌కుమార్ సీసీ కెమెరాలను మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నేరాల నియంత్రణకు, అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు గణేశ్, పెంటారెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బలరాం, నాయకులు ప్రవీణ్, నవీన్, శ్రీనివాస్, రామప్ప, శశిధర్, ప్రశాంత్, ప్రభాకర్, శంకర్, రాములు, మల్లేశ్, అమరేందర్ పాల్గొన్నారు.

నాణ్యతతో అభివృద్ధి పనులు చేయాలి

అండర్ డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న చైర్మన్ నిరంజన్‌రెడ్డి

ఆదిబట్ల, జనవరి 7: నాణ్యతతో అభివృద్ధి పనులను చేయాలని ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో రూ.75 లక్షలతో చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలి

ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్ష నాయకులు

మంచాల, జనవరి 7: గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం అధికారులు ప్రత్యేక చొరువ చూపాలని అఖిలపక్ష నాయకులు అన్నారు. మంగళవారం మంచాల మండలం ఆరుట్ల గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలంటూ మంచాల ఎంపీడీవోకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ ఆరుట్ల గ్రామంలో వెంటనే సమస్య పరిష్కరించాలన్నారు. గ్రామానికి చెందిన తాగునీటి బావిని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారనే విషయం మండల అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సమస్యల పరిష్కారానికి అఖిలపక్ష నాయకులు నిరంతరం పోరాటం చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రాము, జంగయ్య, జంగయ్య, బుగ్గరాములు, రవి, మహేందర్, వంశీ పాల్గొన్నారు.

డాక్టరేట్ రాజూనాయక్‌కు ఘన సన్మానం

రాజూనాయక్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

యాచారం, జనవరి7: సేవారంగంలో ఇటీవలే బెంగుళూరులో డాక్టరేట్ పురస్కారం అందుకున్న నందివనపర్తి మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ మండల నాయకుడు వర్త్యావత్ రాజూనాయక్‌ను బీఆర్ఎస్ ఎస్సీ విభాగం మండల అధ్యక్షుడు మండలి గోపాల్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ.. తండాకు చెందిన గిరిజన బిడ్డకు గౌరవ డాక్టరేట్ పురస్కారం రావడం ఎంతో గర్వకారనమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సభావత్ కిషన్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, గణేశ్, వినోద్, పాపయ్య తదితరులున్నారు.

మాదిగ జేఏసీ చైర్మన్‌గా భాస్కర్

మంచాల, జనవరి 7: ఇబ్రహీంపట్నం నియోజకవర్గ మాదిగ జేఏసీ చైర్మన్‌గా మండల పరిధిలోని ఆరుట్ల గ్రామానికి చెందిన కంబాలపల్లి భాస్కర్‌ను మంగళవారం నిర్వహించిన మాదిగ జేఏసీ సమావేశానికి మాదిగ జేఏసీ గౌరవ అధ్యక్షుడు ప్రతాప్ అధ్యక్షతన ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ ఏబీసీడీ వర్గీకరణ లక్ష్యంగా ఫిబ్రవరి 7న జరుగుతున్న సభకు లక్ష డప్పులు, వెయ్యి గొంతులు చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాదిగ జేఏసీ కోరడం జరిగిందని చెప్పారు. ఈ సభకు ముఖ్య నాయకులతో పాటు ఎమ్మార్పీఎస్ నాయకుడు బాబు తదితరులు హాజరవుతున్నారని, సభకు నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

ఎల్‌వోసీ అందజేత

మండలంలోని లష్కర్‌గూడ గ్రామానికి చెందిన కొడూరు శోభమ్మ గత కొంత కాలంగా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆమెకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 4లక్షలు మంజూరు చేయించారు. మంజూరైన ఎల్‌ఓసిని మంగళవారం ఎమ్మెల్యే నివాసంలో శోభమ్మ కుమారుడు కొండూరు శివకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఉపసర్పంచ్ అల్లె యాదయ్య యాదవ్, మాజీ వార్డు సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కక్కెర్ల జంగయ్యగౌడ్, ప్రసాద్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

- అబ్దుల్లాపూర్‌మెట్

ఎల్‌వోసీని అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

పాడి రైతుల సమస్యలను పరిష్కరించాలి

టీఎస్‌డీడీసీఎఫ్ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డికి
పుష్పగుచ్ఛం అందజేస్తున్న చెన్నకిషన్‌రెడ్డి

కడ్తాల్, జనవరి 7: పాడి రైతుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ చెన్నకిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ లాలాపేట్‌లో టీఎస్‌డీడీసీఎఫ్ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి, సంస్థ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డిని ఆయన వేర్వేరుగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సకాలంలో పాల బిల్లులు చెల్లించక పోవడంతో పాడి రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. వారి వెంట ధీరజ్‌రెడ్డి ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

క్యాలెండర్ ఆవిష్కరణ

చేవెళ్లటౌన్, డిసెంబర్ 7: గవర్నమెంట్ టీచర్ అసోసియేషన్ (జీటీఏ) రంగారెడ్డి జిల్లా టేబుల్ క్యాలెండర్, 2025 నూతన వాల్ క్యాలెండర్‌ను మంగళవారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద పిల్లలను అన్ని రంగాల్లో తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నరసింహ, ప్రధాన కార్యదర్శి సుధాకర్, జిల్లా మహిళా కార్యదర్శి సునీల, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వీరన్న, జిల్లా బాధ్యులు వెంకట రమణకుమార్ ఉన్నారు.

దివ్యాంగులకు సహాయ పరికరాలను అందజేస్తున్న సీఐ నరసింహారావు తదితరులు

దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి

యాచారం, జనవరి7: దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలని యాచారం సీఐ నరసింహారావు అన్నారు. మండల కేంద్రంలోని దివ్యాంగుల భవనం ఆవరణలో మంగళవారం జిల్లా సత్యసాయి సంస్థల ఆధ్వర్యంలో దివ్యాంగులకు సహాయ పరికరాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా సీఐ నరసింహారావు మాట్లాడుతూ.. దివ్యాంగులు స్వయం ఉపాధి పొందేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం బీఎన్‌రెడ్డి ట్రస్టు చైర్మన్ శేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. దివ్యాంగులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, సత్యసాయి సంస్థల ప్రతినిధి దినావన్‌రావు, వీహెచ్‌పీఎస్ నాయకులు సలీం, జంగయ్య, రాములు, బాలరాజు, సంజీవ, భాష, జంగయ్య, పోచయ్య, దివ్యాంగులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్‌రూల్స్ పాటించాలి

సమావేశంలో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

చేవెళ్లటౌన్, డిసెంబర్ 7: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని చేవెళ్ల డివిజన్ ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లు, చేవెళ్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ భూపాల్ శ్రీధర్ తెలిపారు. మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలోని మాడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు దాటేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సిగ్నల్‌పై విద్యార్థులకు వివరించారు. బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం, ట్రిపుల్ రైడింగ్, ట్రాఫిక్ సిగ్నల్ వద్ద జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చిన్నపురెడ్డి, చేవెళ్ల ట్రాఫిక్ ఏఎస్ఐ అశోక్, పోలీస్ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాడ్డెక్కినా వీడని పాగమంచు

మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం తెల్లవారుజాము నుంచి ఉదయం దాదాపు 10 గంటల వరకు పొగమంచు వీడలేదు.

- పెద్దఅంబర్‌పేట, జనవరి 7

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

ఆమనగల్లు, జనవరి 7: పీఆర్‌టీయూ టీఎస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను మంగళవారం మండల విద్యావనరుల కేంద్రం ఆవరణలో ఉపాధ్యాయులు, పీఆర్‌టీయూ సంఘం నాయకులతో కలిసి మండల విద్యాధికారి పాండు ఆవిష్కరించారు. క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు రాఘవేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, మాజీ అధ్యక్షుడు గోపర్ధన్ యాదవ్, మండల అధ్యక్షుడు మల్లేశ్వర్, ప్రధాన కార్యదర్శి మాధవ రెడ్డి, మహిళ ఉపాధ్యక్షురాలు మమత, అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కరరావు, కార్యదర్శి నాల్‌రాజ్. పీఆర్‌టీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను
అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌టౌన్, జనవరి 7: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం కేశంపేట, కొందుర్గు మండలాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. అదే విధంగా సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతుందన్నారు. ఈ సందర్భంగా 136మందికి రూ. కోటి36,15,776 కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, మరో 30మందికి రూ. 13,93,500 సహాయనిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, డైరెక్టర్ కరుణాకర్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, బాల్‌రాజు, కృష్ణారెడ్డి, రమేశ్, సత్తయ్య, చందు, శ్రీను, శ్రీనాథ్ పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

షాద్‌నగర్‌టౌన్ : చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తన సొంత నిధులతో విద్యార్థులకు ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థులు దూర ప్రాంతాల నుంచి షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారని, మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారనే ఉద్దేశంతో మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాక్షించారు. కళాశాలలో 800మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించనున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, కౌన్సిలర్ శ్రావణి, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, కృష్ణ, పురుషోత్తంరెడ్డి, మాధవులు, రమేశ్ పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎంఆర్ఎఫ్

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, జనవరి 7: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధిలోని మంగళపల్లి గ్రామానికి చెందిన శ్రీనుకు సీఎంఆర్ఎఫ్ కింద రూ. 60వేలు చెక్కు మంజూరైంది. ఈ చెక్కును మంగళవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, నాయకులు శేఖర్‌రెడ్డి, రామకృష్ణ ఉన్నారు.

ప్రశ్నించిన నేతలపై కేసులు

బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి ఆంజనేయులు

షాబాద్, జనవరి 7: రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేక ప్రతిపక్ష నాయకులపై కేసుల రూపంలో దాడి చేస్తుందని బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి ఆంజనేయులు అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం కోసం ప్రజలకు అనేక హామీలు ఇచ్చి మోసం చేసిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేసు కూడా ఇందులో భాగమేనన్నారు. కేటీఆర్‌పై వస్తున్న ఆరోపణలకు భయపడే ప్రసక్తే లేదని, కావాలనే బీఆర్ఎస్ నాయకులపై కేసులు సృష్టిస్తున్నారని, ప్రశ్నించిన నేతలపై కేసులు పెడుతున్నారని, ఎన్ని కుట్రలు చేసినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

అటవీ ప్రాంతంలో మంటలు

మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

పెద్దఅంబర్‌పేట, జనవరి 7: మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారంలోని హరిణవనస్థలి అటవీ ప్రాంతంలో మంగళవారం సాయంత్రం అగ్నిప్రమాదం చోటుచేసుకున్నది. ఫతుల్లాగూడలోని ముక్తిఘాట్‌కు ఎదురుగా ఉన్న అటవీప్రాంతం వెంట వాహనదారులతోపాటు సమీపంలోని పలువురు ఇండ్ల యజమానులు చెత్తాచెదారాలను వేస్తున్నారు. పాడయిన వస్తువులు, సోఫాలు తదితర పనికిరాని వాటిని అటవీప్రాంతంలోకి విసిరేస్తున్నారు. ఎవరైనా సిగరెట్ తాగి పడేయడం లేదా చెత్తను తగలబెట్టే క్రమంలో మంటలు చెలరేగినట్లు అటవీ అధికారులు భావిస్తున్నారు. స్థానికుల సమాచారంతో అగ్నిమాపకశాఖ, నాగోల్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ సాగర్ పర్యవేక్షణలో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. జింకలు, నెమళ్లు, కుందేళ్లు, అడవి పందులు తదితర జంతు సంపదకు నిలయమైన హరిణవనస్థలి అటవీ ప్రాంతం సంరక్షణపై అధికారులు శ్రద్ధ పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బోరుబావికి మరమ్మతులు

మంచాల, జనవరి 7: మండల పరిధిలోని జాపాల గ్రామానికి చెందిన నోముల రమేశ్ వారం రోజులుగా గ్రామ పంచాయతీలోని ఎస్సీ కాలనీలో ఉన్న బోరు బావి కాలిపోవడంతో వివిధ వార్డులకు చెందిన ప్రజలు నిత్యం నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బోరు బావి కాలిపోయిన విషయం గ్రామ పంచాయతీ కార్యదర్శికి, మండల అధికారులకు చెప్పినా కూడా వారు పట్టించుకోకపోవడంతో గ్రామానికి చెందిన నోముల రమేష్ సొంత ఖర్చులతో బోరు బావిని బాగుచేయించారు.